ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





తీరనున్న తాగునీటి కష్టాలు

తీరనున్న కష్టాలు..

కాగజ్‌నగర్ పట్టణవాసులకు తాగునీటి కష్టాలు ఇక తీరనున్నాయి. ప్రధాన పైపులైన్లకు ఇంటర్‌లింక్ పనులు మరో నెలరోజుల్లో పూర్తి కానున్నాయి. దీంతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఉండదు. పట్టణవాసులకు ఇకపై పుష్కలంగా నీరు సరఫరా అయ్యే అవకాశం ఉంది. పట్టణానికి రెండు విధాల నీరు అందనుంది. పెద్దవాగు నుంచి కాగజ్‌నగర్ బాలాజీనగర్ ట్యాంక్‌కు సరఫరా, అలాగే మిషన్ భగీరథ ద్వార ఈఎస్ఐ, సర్‌సిల్క్‌ట్యాంకులకు నీరు అందనుంది. వీటి నుంచి వార్డులకు అనుసంధాన ప్రక్రియ పూర్తి చేశారు. ఇక నీటి సరఫరాలో సమస్య లేకుండా ఉంటుంది.

- మరో నెలరోజుల్లో పైపులైన్ పనుల పూర్తి
- మిషన్ భగీరథతో పాటు ఇంటేక్ వెల్‌తో నీటి సరఫరా

కాగజ్‌నగర్, మే 31: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలోని 30వార్డులకు తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటేక్ వెల్ నుంచి కాగజ్‌నగర్‌లోని 20వార్డులకు, మిషన్ భగీరథ పథకం నుంచి పది వార్డులకు నీటి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐదేళ్ల క్రితం కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో రూ.35 కోట్ల నిధులతో ఇంటేక్ వెల్ పనులు ప్రారంభించారు. ఈ నిధులతో ఇంటేక్ వెల్ నిర్మాణం, పెద్దవాగు నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి నీటిని సరఫరా చేసేందుకు కొత్త పైపులైన్ కనెక్షన్ పనులు పూర్తిచేశారు. ఈ పైపులైన్ ద్వారా మున్సిపాల్టీలోని బాలాజీనగర్, మార్కెట్ ఏరియా, సంజీవయ్య కాలనీ, నవ్‌గాం బస్తీ, రైల్వేకాలనీలతోపాటు పలు ఇతర ఏరియాలకు తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక మిషన్ భగీరథ పథకం ద్వారా కాగజగనర్‌లోని సర్‌సిల్క్ ఏరియా, ఫాతిమా కాన్వెంటు కాలనీ, ఎఫ్‌కాలనీ తదితర కాలనీలకు నీటిని అందిస్తున్నారు.

● తుది దశకు చేరిన ఇంటర్ లింక్ పనులు..

మిషన్ భగీరథ పథకం ద్వారా కాగజ్‌నగర్‌కు నీటి సరఫరా చేసేందుకు ఇంటర్ లింక్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ పనులు మరో నెలరోజుల్లో పూర్తి కానున్నాయి. ఈ పనులు పూర్తైతే తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుంది. ఇంటర్ లింక్ పనులు కొనసాగుతుండటంతో నెలలో రెండుమార్లు తాగునీటి సరఫరాను నిలిపి వేస్తున్నారు. ఆ సమయాల్లో ఆయాకాలనీల్లో ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం వార్డుల్లో ప్రధాన పైపులైన్‌కు తరుచూ లీకేజీలు జరుగుతున్నాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బాలాజీనగర్, సర్‌సిల్క్ ఏరియా తదితర కాలనీల్లో ఉన్న లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు.

తాగునీటి సమస్య లేకుండా చూడడమే లక్ష్యం..

-అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



కాగజ్‌నగర మున్సిపాల్టీలో 30వార్డులకు తాగునీటి సమస్య లేకుండా చూడడమే లక్ష్యం. ఇందుకోసం పక్కా ప్రణాళికతో పనులు చేపడుతున్నాం. పెద్దవాగు వద్ద ఇంటేక్ వెల్ నిర్మాణం పూర్తైంది. ప్రధాన పైపులైన్ ద్వారా పట్టణానికి నీటిని సరఫరా చేస్తున్నాం. అలాగే మిషనభగీరథ ద్వారా కూడా నీటిని అందిస్తున్నాం. ప్రస్తుతం ఇంటర్ లింక్ పనులు పూర్తి చేస్తున్నాం. పలువార్డుల్లో లీకేజీ పనులు చేస్తున్నాం. మరో నెలరోజుల తర్వాత నుంచి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

దానాపూర్‌లో పోడుభూముల లొల్లి

- పోడు రైతులకు, అధికారులకు మధ్య వాగ్వాదం
- వెనుతిరిగి వెళ్లిపోయిన అధికారులు



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్ రూరల్, మే 31: ఆసిఫాబాద్ మండలంలోని దానాపూర్ గ్రామంలో శుక్రవారం అటవీశాఖ అధికారులకు పోడుభూముల రైతులకు వాగ్వాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన 60మంది రైతులు కొన్ని సంవత్సరాలుగా 150ఎకరాల్లో అటవీభూమిని సాగు చేస్తు న్నారు. ఇదే క్రమంలో గతసంవత్సరం అప్పటి జిల్లాఅటవీశాఖ అధికారి శాంతారాం గ్రామానికి వెళ్లి భూములుచూసి వాటినిస్వాధీనం చేసుకుంటామన్నారు. గ్రామస్థులతో చర్చలు జరిపి 10ఎకరాల భూమిని అటవీఅధికారులు తీసుకున్నారు. అప్పుడు జరిగిన ఒప్పందంమేరకు వచ్చేసంవత్సరం మరికొంత భూమి ఇస్తామని గ్రామస్థులు ఒప్పుకున్నట్లు అటవీఅధికారులు చెబుతున్నారు. ఇదేక్రమంలో శుక్రవారం సదరుభూములను చూడడానికి జిల్లాఅటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వో అప్పలకొండ, డిప్యూటీరేంజ్‌అధికారి యోగేష్, బీట్‌అధికారి రవి వెళ్లగా గ్రామస్థులు వారిని ఊర్లోనే అడ్డు కున్నారు. గతంలోనే భూములు చూస్తామంటూ వచ్చి పదిఎకరాలు తీసుకున్నారని ప్రస్తుతం మరోసారి భూములు చూడడానికి ఒప్పుకోమని అడ్డుతగిలారు. అయితే గ్రామస్థుల దగ్గర ఏదైనా పత్రాలు ఉన్నాయా అని అటవీ అధికారులు అడగగా తాము బీసీకి చెందిన వారం కావడంతో ఎటువంటిపత్రాలు లేవన్నారు. అయినప్పటికీ భూములు వదులుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఒకవేళ అటవీ అధికారులు భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. దీంతో అటవీఅధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

పొగాకు వాడకాన్ని నిర్మూలించాలి: డీఎంహెచ్‌వో



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్

ఆసిఫాబాద్ రూరల్, మే 31: పొగాకు వాడకాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి తుకారాంభట్ అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం అడ ప్రాథమికఆరోగ్యకేంద్రంలో జిల్లావైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాంభట్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను ఎక్కువగా వినియోగిస్తే ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డాక్టర్ వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి: ఏఎస్పీ

ఆసిఫాబాద్, మే 31: ఉద్యోగికి పదవీవిరమణ అనివార్యమని ఏఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్‌ఫారిద్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు సంఘం ఆధ్వర్యంలో సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పదన్నారు. శేషజీవితం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, పోలీసుసంఘం సభ్యులు ఎంపీఎస్ రెడ్డి, స్వామి, దేవాజీ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

బెజ్జూరు, మే 31: మండలంలోని అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు 50కిలోల బియ్యం, రూ.2వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్, శంకర్, రాజారాం, హకీం పాల్గొన్నారు.

పలువురు ఎస్పీఎం ఉద్యోగుల పదవీ విరమణ

కాగజ్‌నగర్, మే 31: ఎస్పీఎంలోని పలువురు ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఫైబర్ లైన్ మెయింటెన్స్ మేనేజర్‌గా ఎస్ సురేందర్‌రావు, ఇతర డిపార్టులకు చెందిన భగవంతులు, సాయి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయా డిపార్టుమెంటుల ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. మిల్లుకార్మికులు, సిబ్బందికూడా శాలువాలతో వారిని సన్మానించారు.

బాక్సింగ్‌లో రాణించాలి

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, మే 31: విద్యార్థులు బాక్సింగ్‌లో రాణించాలని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు అన్నారు. మే1నుంచి 31వరకు నిర్వహిస్తున్న వేసవిశిక్షణశిబిరం శుక్రవారం ముగిసింది. ఈశిబిరంలో 50మంది విద్యార్థులకు ఉచితంగాబాక్సింగ్‌లో మెలకువలు నేర్పించామన్నారు. ఈ సందర్భంగా జిల్లాబాక్సింగ్‌ఛైర్మన్ శివనాయక్ బాక్సింగ్‌కు సంబంధించిన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్‌కార్యదర్శి మధురైశేఖర్, రమాకాంత్, లలిత్, జయేందర్, బలరాం, జబేదుద్దీన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

వాంకిడి, మే 31: మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయిపూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బోర్దా గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలీసంఘం రాష్ట్రఅధ్యక్షుడు నారాయణ,కాంగ్రెస్‌పార్టీ నియోజకఇన్‌చార్జీ అజ్మీరాశ్యాంనాయక్, సంఘంజిల్లా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

కెరమెరి, మే 31: గ్రామాల్లో పల్లె ప్రగతి పనులను పకడ్బందీగా చేపట్టాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం, కెరమెరి గ్రామాల్లోని పల్లెప్రగతిపనులను తనిఖీచేశారు. గ్రామాల్లో చేపడుతున్న నర్సరీ, పల్లెప్రకృతివనాల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి

పెంచికలపేట, మే 31: మండలంలోని గుంట్లపేట గ్రామానికి చెందిన దాసరి జీవన్‌కుమార్(25) కిడ్నీవ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. గ్రామానికి చెందిన చంద్రమౌళి, సువర్ణల కుమారుడు జీవన్‌కుమార్ ఏడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా గతబుధవారం కిడ్నీమార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నా మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్



కేజీబీవీ పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, మే 31: అమ్మఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి కేజీబీవీపాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని సమూలంగా మార్చాలని తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులు, డైనింగ్‌హాల్, ఇతర మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని తెలపారు. ఆయనవెంట డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఏఈ నజ్మోద్దీన్ తదితరులు ఉన్నారు.

పీడీ యాక్టు నమోదు చేస్తాం..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ ధరకే విత్తనాలు అమ్మాలని సూచించారు. ఆయనవెంట ఏడీఏ వెంకటి, ఏవో గోపికాంత్, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు తదితరులు ఉన్నారు.

సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలి..

జైనూర్: విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు కుట్టివ్వాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఆయన జైనూరు ఐకేపీ కార్యాలయాన్ని అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఐకేపీ సమాఖ్య కుట్టు మిషన్‌కేంద్రాన్ని వారు సందర్శించి సమాఖ్య సభ్యులు బట్టలు కుడుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సమాఖ్య సభ్యులు స్వయంఉపాధి కోసం కుట్టుశిక్షణ ఏర్పాటు చేయడం, తద్వార లబ్ధి పొందడం బాగుందన్నారు. అనంతరం ఐకేపీలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని సమాఖ్య అధ్యక్షురాలు మోతుబాయి తదితరులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కోరారు. ఈ సందర్భంగా డీఆర్డీవో పీడీ సురేందర్, ఏపీడీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధరణి ఫైళ్లను పరిశీలించిన ఆర్డీవో

తిర్యాణి, మే 31: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో టీఎం33 తదితర అంశాలతో పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైళ్లను శుక్రవారం ఆర్డీవో లోకేశ్వర్ పరిశీలించారు. ధరణికి సంబంధించిన పెండింగ్‌లోఉన్న ఫైళ్లగురించి తహసీల్దార్ సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పెండింగ్ ఫైలన్నీ పూర్తయ్యే విధంగా చూడాలని సూచించారు. అనంతరం తహసీల్దార్‌తో కలిసి గంబీరావుపేటలో గల వడ్ల కొనుగోలు గిడ్డంగిని సందర్శించారు. ఆయనవెంట డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తా: డాక్టర్ నవ్య

కాగజ్‌నగర్, మే 31: తనపై నిరాధరమైన ఆరోపణలు చేసిన సంజన ఆసుపత్రి యజమాని శ్రీనివాస్‌పై హైదరాబాద్‌లోని ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు శ్రీషైన్ ఆసుపత్రి వైద్యురాలు నవ్య తెలిపారు. శుక్రవారం స్థానికంగా విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు మూర్ఛవ్యాధి ఉన్నట్టు తప్పుడు ప్రకటనలు జారీ చేయటం దారుణమన్నారు. తాను ఎస్సీ కావటంతో తన కేరీర్ దెబ్బతీసే విధంగా శ్రీనివాస్ ఆరోపణలు చేస్తున్నాడన్నారు. మాదిగ సంఘాల మహాకూటమి ఆదిలాబాద్ జిల్లాచైర్మన్ ఇరిగిరాల భాస్కర్ మాట్లాడుతూ డాక్టర్‌నవ్యకు లేనివ్యాధి ఉన్నట్టు ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ రాహుల్, శ్రీను, చిలుముల సురేష్, గోగర్ల నరేష్, కుమార్, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఆదిలాబాద్‌లో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌లు, ఎస్పీ, అదనపు కలెక్టర్‌లు

ఆసిఫాబాద్, మే 31: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే13న జరిగిన పోలింగ్‌కు సంబంధించిన కౌంటింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని తెలంగాణ సాంఘికసంక్షేమ రెసిడెన్షియల్ బాలికల ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్‌కేంద్రాన్ని ఆదిలాబాద్ కలెక్టర్, రిటర్నింగ్‌అధికారి రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, దాసరివేణుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓట్లలెక్కింపు ప్రక్రియ కొరకు కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కుమరంభీం జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి అవసరమైన అన్నిసదుపాయాలు కల్పించామన్నారు. మీడియాసెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఓట్లలెక్కింపులో ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కొరకు 16టేబుళ్లు, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ కొరకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. 23రౌండ్ల ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఇందు కోసం రిజర్వ్, సీలింగ్‌సిబ్బంది కలుపుకొని సుమారు 300మంది కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్రమంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్నిఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



ఆసిఫాబాద్‌లో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఆసిఫాబాద్, మే 31: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండలు దంచికొడు తుండడంతో జిల్లాలో వాతావరణం నిప్పులకొలిమిలా మారింది. శుక్రవారం జిల్లాలో 45.9డిగ్రీల అత్యధికఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకోవడంతో మధ్యాహ్నవేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండతీవ్రతకు జనాలు బయటికి రావాలంటే జంకుతున్నారు. జిల్లాలోని దహెగాం మండలంలో 45.9డిగ్రీల అత్యధికఉష్ణోగ్రతలు నమోదుకాగా మిగితామండలాల్లో 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

సిర్పూర్(టి): ఎండతీవ్రత పెరగడంతో మండలకేంద్రంలో రోడ్లన్నీనిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10నుంచే ఎండతీవ్రత అధికంగా ఉండడంతో సాయంత్రం 5దాటిన తరువాతకూడా ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రావడం లేదు. మండలంలో 45డిగ్రీలపైన ఉష్ణోగ్రత నమోదు అయినట్లు అధికారులు తెలిపారు

ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీచేసిన జిల్లా వ్యవసాయాధికారి



కౌటాలలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

కౌటాల, మే 31: మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస రావు శుక్రవారం ఏవో రాజేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా విత్తనచట్టం1966ను పాటించాల న్నారు. నాణ్యమైనవిత్తనాలు రైతులకు అందుబా టులో ఉంచాలన్నారు. రైతులు విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం అన్ని దుకాణాల్లో బీటి-2(బోల్‌గార్డ్-2) విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మండలాల్లో తనిఖీ చేసిన అధికారులు

రెబ్బెన: రెబ్బెనలో ఫెర్టిలైజర్ దుకాణాలను తహసిల్దార్ జ్యోత్స్న, ఎస్సై చంద్రశేఖర్, ఏవో మంజుల శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలుంటాయని, అధిక ధరలకు విత్తనాలు అమ్మరాదన్నారు.

దహెగాం: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలుపాటించాలని ఎంఈవో ఆనంద్ అన్నారు. మండలంలోని హత్తిని, కుంచవెల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కల్వాడ గ్రామంలో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించారు.

వాంకిడి: విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని ఏఈవోలు సూచించారు. శుక్రవారం మండలంలోని పలుగ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

‘బడిబాట’ను విజయవంతం చేయాలి



ఆసిఫాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్, మే 31: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవోఅశోక్ అన్నారు. శుక్రవారం జిలా కేంద్రంలోని జడ్పీబాలికల ఉన్నతపాఠశాలలో జిల్లాలోని ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్3 నుంచి 19వరకు బడిబాట కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, డ్రాప్ అవుట్ లేకుండా చూడాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు.

మండలాల్లో ‘బడిబాట’పై కార్యక్రమాలు

వాంకిడి: బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా అధికారులందరు సమష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో వరలక్ష్మి పేర్కొన్నారు. బడిబాటలో చేపట్టాల్సిన కార్యాచరణపై వివరించారు. కార్యక్ర మంలో ఎంఈవో మనుకుమార్, ఏపీఎం మహేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): బడి మానిన పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిదని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఐకేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతిమండల, గ్రామస్థాయి అధికారులు డ్రాప్ అవుట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, అంగన్ వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో కోటప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామసంఘం ప్రతినిధులు, ఐకేపీఉద్యోగులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

దహెగాం: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, నగేష్, సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రెబ్బెన: బడిబాటకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో వెంకటేశ్వరస్వామి అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. బడీడుపిల్లను బడిలో చేర్పించాలని కోరారు. సమావేశంలోఎంపీడీవో శంకరమ్మ, ఎం పీఎం వెంకటరమణ, గౌతమి, తదితరులున్నారు.

కెరమెరి: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే ధ్యేయంగా మహిళా సంఘాల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

శ్రీరాంపూర్, మే 31: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. బొగ్గుఉత్పత్తి, ఉత్పాదకత, తెలంగాణ ఆవిర్భావవేడుకల నిర్వహణపై శుక్రవారం ఆయన వివిధగనులు, విభాగాల అధిపతులు, అధికారులతో జీఎం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది జరిగిన ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. తగు సూచనలు చేశారు. జూన్2న ఉదయం 8గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీ పీవోలు శ్రీనివాస్, శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు పాలొన్నారు.

అన్ని యూనియన్లను ఆహ్వానించాలి..: టీబీజీకేఎస్

సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలకు అన్ని యూనియన్లను ఆహ్వానించాలని టీబీజీకేఎస్ నాయకుడు కె సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గతేడాది అన్ని యూనియన్లకు చెందిన నాయకులను వేదికపైకి ఆహ్వానించారని, ఈసారి సైతం అలాగే చేయాలని ఆయన విన్నవించారు.



వివాహిత ఆత్మహత్య

మందమర్రిటౌన్, మే 31: పట్టణంలోని 1వ జోన్‌కు చెందిన మర్రి విజయలక్ష్మి, అలియాస్ ప్రణయ (28) శుక్రవారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం మరో గదిలో ఉన్న ఆమె భర్త గౌతమ్ విజయలక్ష్మిని పిలువగా ఎంతకు బయటకు రాకపోవడంతో తలుపులు నెట్టి లోపలికి వెళ్లగా చీరతో ఫైపుకు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో తల్లిదండ్రులకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు తండ్రి రాజయ్య ఆత్మహత్య చేసుకోలేదని, హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు అల్లుని కుటుంబీకులే చంపారని గొడవ చేశారు. దీంతో గౌతం తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. కాగా అదనపు కట్నం కోసం తన కూతురిని వేధించేవారని మృతురాలు తండ్రి రాజయ్య తెలిపాడు. పోస్టుమార్టం అనంత రం మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జన్నారం, మే 31 : మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన సానం రామన్న (57) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధిహామీ పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా ఇందన్‌పల్లి గ్రామ శివారులోని చెరువు వద్దకు రాగానే వెనక నుంచి కొత్తపేట గ్రామానికి చెందిన టేకం పగ్గు వేగంగా ఢీకొట్టడంతో రామన్న కింద పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





పథకం ప్రకారమే అమ్మమ్మ ఇంట్లో చోరీ

- ప్రేమించిన యువకుడితో కలిసి నగదు, నగలు అపహరించిన యువతి

నస్పూర్, మే 31 : నస్పూర్‌లోని న్యూ నాగార్జున కాలనీ చెందిన సింగరేణి కార్మికుడు సత్త య్య ఇంట్లో మూడు రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. తాత, అమ్మమ్మ లేని సమయంలో చోరీకి కట్టుకథ అల్లీ చివరకు పోలీసుల సాంకేతిక పరిజ్ఞానంలో దొరికిపోయారు. దొంగతనంకు పాల్పడిన యువతీ, యువకుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవి కుమార్‌లు తెలిపారు. హైదరాబాద్‌లో చదువుకునే యువతి వేసవి సెలవులకు నాగార్జున కాలనీలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. యువతికి గత ఏడాది ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన యువకుడితో పరిచ యం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణ యించుకున్నారు. తాత ఇంట్లో బంగారం, నగదును చూసి మనుమరాలు యువకుడికి చెప్పింది. పథకం ప్రకారం యువకుడు హైదరాబాద్ నుంచి వచ్చాడు. తాత సింగరేణి ఉద్యోగానికి, అమ్మమ్మ సాయంత్రం వాకింగ్‌కు వెళ్లారు. దీంతో ఇంట్లో యువతి ఒక్కతే ఉండి యువకుడికి ఫోన్ చేసి చెప్పింది. ఇంటి వెనుక గోడ దూకిన యువకుడు ఇంట్లోకి వచ్చాడు. ఇద్దరు కలిసి ఇంట్లోని బీరువా పగుల గొట్టి రూ. 4.50 లక్షల నగదు, 15 తులాల బంగారం, 30 తులాల వెండి నగలను తీసుకున్నారు. వాటిని తీసుకుని యువకుడు గోడ దూకి పారిపోయాడు. ఇంటి ముందర తాళం వేసి యువతీ బయటకు వెళ్లింది. అమ్మమ్మ వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా గమనించి ఆమెతో కలిసి ఇంట్లోకి వచ్చింది. అమ్మమ్మతో ఇంట్లోకి వచ్చాక కూడా ఏమి తెలియనట్లు ఉండిపోయింది. బెడ్‌రూమ్‌లో బీరువా పగులగొట్టినట్లు ఉండడం అందులోని నగలు, నగదు కనిపించకపోవడంతో చుట్టూ ప్రక్కల వారికి చెప్పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సీసీసీ నస్పూర్ పోలీసులు, ప్రత్యేక పోలీస్ బృందాలు చేరుకుని గాలింపు చేపట్టారు. జాగిలాలు, ఫింగర్ ప్రింట్ నిపుణులను పరిశోధించారు. సీసీ కెమెరాలు, మోబైల్ ఫోన్ డాటా విశ్లేషణలతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలతో దొంగతనంకు పాల్పడిన నిందితులను పట్టుకున్నామని సీఐ, ఎస్సైలు తెలిపారు. నిందితుల నుంచి రూ. 4.25 లక్షల నగదు, 15 తులాల బంగారం, 30 తులాల వెండి, ద్విచక్ర వాహనంను స్వాదీనం చేసుకుని యువతీ, యువకుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ, ఎస్సైలు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ అశోక్, ఎస్సైలు రవి కుమార్, జితేందర్ సింగ్, క్రైమ్ టీం ఇజాజ్, నరేందర్, సీసీ ఎస్ టీం సతీష్, శ్రీనివాస్‌లను సీపీ శ్రీనివాస్, డీసీపీ అశోక్ కుమార్ అభినందించారు.

ఏసీపీ కార్యాలయం ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఏసీసీ, మే 31: మంచిర్యాల పట్టణంలోని గోపాల్‌వాడకు చెందిన తూము మోహన్ అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మోహన్ భార్య లత, చెల్లెలు స్వప్నలు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్ తండ్రి తూము నర్సయ్య 2008లో శిరీషదేవి, రామ్‌రెడ్డి అనే వ్యక్తుల నుంచి గర్మిళ్ల శివారులోని పోచమ్మ చెరువు సమీపంలో సర్వే నంబరు 370లో 32 గుంటల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో ఐదు రూములతో షెడ్డు కూడా నిర్మించారు. మోహన్ తండ్రి మృతిచెం దాడు. మోహన్ ఆరోగ్యం సరిగ్గా ఉండకపోవడంతో గోపాల్‌వాడలోని సొంత ఇంట్లో నివసిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా భూమిని, షెడ్డును కొంత మంది వ్యక్తులు స్థలం కబ్జా చేసి తమను రానివ్వడం లేదన్నారు. ఈ విషయంపై మంచిర్యాల పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఈ నెల 9న మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ నిమిత్తం పదే పదే పోలీస్‌స్టేషన్‌కు పిలువడంతో మానసిక క్షోభకు గురైన మోహన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గొంతుకోసుకున్నారు. పోలీసులు హుటాహుటిన మెడిలైఫ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై మంచిర్యాల ఏసీపీ ప్రకాష్‌ను వివరణ కోరగా మోహన్‌పై దాసరి నరేష్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. దీని విచారణలో భాగంగానే అతడిని విచారణకు పిలిచామని చెప్పారు. మోహన్ మానసిక స్థితి సరిగ్గా లేకనే ఆత్మహత్యాయత్నానికి యత్నించాడన్నారు. కాగా మోహన్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, వైద్యులు ఇంటికి తీసుకు వెళ్లాలని తెలిపినట్లు మోహన్ భార్య లత తెలిపింది.







తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

» వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...

» అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?

» కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

» టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

» ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?

» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిలరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

» రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

» అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

» అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగష్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాబా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

» కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?

» మహేష్ కుమార్ గౌడ్

» సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్తూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మీ, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

» అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు

» ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు

» లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?

» 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు

» విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

» సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లింద్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరంన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



యువకుడి ఆత్మహత్య

చెన్నూరు, మే 31 : మండలంలోని సుందరసాల గ్రామానికి చెందిన ముంజం శ్రీకాంత్(24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ మజీద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్‌కు ఇద్దరు అన్నలు, ఒక అక్క ఉన్నారు. తండ్రి చంద్రయ్యకు మతి స్థిమితం లేదు. శ్రీకాంత్ తరుచుగా మద్యం సేవించేవాడు. తల్లి బానక్క మందలించింది. దీంతో శ్రీకాంత్ గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి తల్లికి చెప్పాడు, మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

విత్తనాల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



విత్తనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

హాజీపూర్, మే 31: జిల్లాలో పంట సాగుకు ఉపయోగించే పచ్చిరొట్ట, పత్తి విత్తనాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో టీ సీడ్ పోర్టల్ ద్వారా పంపిణీ జరుగుతున్న విధానం, స్టాక్ వివరాలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నామని చెప్పారు. సేంద్రియ పద్ధతిలో సాగు జరిగేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్థానిక మల్లికార్జున ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. పత్తి విత్తనాల లభ్యత, ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. జిల్లాలో నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలు, ఎరువుల విక్రయం, వినియోగం జరిపే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ సాంకేతిక అధికారి సంకె శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కృష్ణ ఉన్నారు.

● కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్: హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటు న్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

● లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు

రానున్న వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో న స్పూర్ మండలానికి సంబంధించి ఏర్పాటు చేసిన రెవెన్యూ వర్షమాపక కేంద్రాన్ని ముఖ్య ప్రనాళిక అధికారి సత్యం, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

● రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, సీ విభాగం పర్యవేక్షకులు సంతోష్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

ఏసీసీ, మే 31: మంచిర్యాల పట్టణానికి చెందిన సాధుల సుమన్ అనే వ్యక్తి ప్రమాదంలో ఇటీవల మృతిచెందగా గాయత్రి బ్యాంకులో మృతుడి పేరిట ఉన్న నిర్భయ సేవింగ్ ఖాతాకు సంబంధించి లక్ష రూపాయల బీమా చెక్కును శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య చేతుల మీదుగా సిబ్బంది బాధిత కుటుంబీకులకు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ ఉప్పలయ్య మాట్లాడుతూ గాయత్రి బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

లక్సెట్టిపేటరూరల్, మే 31: ఫెర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ హెచ్చరించారు. శుక్రవారం లక్సెట్టిపేట పట్టణంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తనాల ప్యాకె ట్లు, రశీదు బిల్లులను పరిశీలించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

తాండూర్: మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయ, శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, మండల వ్యవసాయాధికారి కిరణ్మయిలు తనిఖీలు దుకాణాల్లోని స్టాక్ రిజిష్టర్‌లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. తనిఖీల్లో ఏఈవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చెన్నూరు, మే 31 : సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారం ప్రాజెక్టు ముంపు ప్రాంత రైతులు శుక్రవారం రాష్ట్ర చివాలయంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అన్నారం ప్రాజెక్టు వల్ల చెన్నూరు మండలంలోని సుందరసాల, నర్సక్కపేట, పొక్కూరు, బీరెల్లి, నాగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రికి వివరించారు.

చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి

వేమనపల్లి, మే 31: గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని నీల్వాయి, కేతనపల్లి గ్రామాల్లో పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్‌లు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్ర మంలో ఎంపీవో శ్రీపతి బాపురావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

మందమర్రిటౌన్, మే 31 : క్రీడల అభివృద్ధికి యాజమాన్యం కృషి చేస్తుందని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. సింగరేణి పాఠశాల మైదానంలో వేసవి శిక్షణ క్రీడల శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

జైపూర్, మే 31: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. మండలంలోని రామారావుపేట, ఇందారం, కుందారం, గంగిపెల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

పొగాకు ఉత్పత్తులు వినియోగించొద్దు

బెల్లంపల్లి, మే 31: పొగాకు ఉత్పత్తులు వినియోగించకూడదని, దీని వల్ల అనారోగ్యం బారిన పడుతారని తాళ్లగురిజాల ఆరోగ్య కేంద్రం వైద్యుడు కిరణ్, ఇన్‌చార్జీ బెల్లంపల్లి వైద్యుడు శివప్రతాప్, ప్రోగ్రాం అధికారి ఇమాంజలి అన్నారు. శుక్రవారం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

నస్పూర్: పొగాకు ఉత్పత్తులను అరికట్టాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతె రాయలింగు డిమాండ్ చేశారు. పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా నస్పూర్‌లోని సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలింగు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను పీల్చేస్తున్న పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలన్నారు. పొగాకు వినియోగం కారణంగా తలెత్తే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

- సీఎంఆర్ ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం
- ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నా స్పందన కరువు
- జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్



మిల్లర్ల మాయాజాలం

జైపూర్‌లో అధికారులు సీజ్ చేసిన రైస్ మిల్లు

మంచిర్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైసు మిల్లుల యజ మానులు ప్రభుత్వానికి సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రతి సీజన్‌లో ప్రభుత్వం పలు ఏజెన్సీలతో నేరుగా కొనుగోలు చేస్తున్నారు. అలా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) కోసం రైస్ మిల్లర్లకు అప్పగిస్తుంది. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకున్న మిల్లర్లు దాన్ని మరాడించి, బియ్యంగా మార్చి పౌరసరఫరాల శాఖ ద్వారా తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. కాగా సీఎంఆర్ కోసం సీజన్ల వారీగా ఎప్పటికప్పుడు ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లు మరాడిం చకుండా అమ్ముకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఏ సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని అదే సీజన్‌లో ఇవ్వాల్సి ఉన్నా మిల్లర్లు ఏళ్ల తరబడి పక్కదారి పట్టిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద మొత్తంలో సీంఆర్ పెండింగులో పడింది.

● ధాన్యం కొనుగోళ్లలో..

రైతులు సాగుచేసిన ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు ప్రతిసీజన్‌లో పడుతున్న శ్రమ అంతా ఇంతకాదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం నుంచి ధాన్యం తూకం వేసి, లారీల్లో మిల్లర్లకు తరలించే వరకు అధిక ప్రయాసలు పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో లక్ష్య చేరేందుకు నానా తంటాలు పడుతున్నారు.కాఆగా మిల్లర్ల మా యాజాలం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. మిల్లింగ్ చే యడంలో రకరకాల కారణాలు చెబుతూ ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. గత సీజన్‌లకు సంబంధించి ఇంకా 21 మిల్లుల్లో సీఎంఆర్ పెండింగులో ఉన్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్లు ధాన్యాన్ని అక్రమంగా అమ్ముకోవడం ద్వారా కోట్లు సంపాదించినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సీఎంఆర్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తుండడంతో మిల్లరు టార్గెట్ పూర్తి చేసేందుకు నానా తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

● పెండింగులో 69,361 మెట్రిక్ టన్నులు..

గత ఏడాది వానాకాలం సాగుకు సంబంధించి జిల్లాలోని 51 రైస్ మిల్లులకు పౌరసరఫరాల శాఖ 1,31,825 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అలాట్‌మెంట్ ఇచ్చింది. సీఎంఆర్‌కు ఎంపిక చేసిన వాటిలో 19 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉండగా, 32 రా రైస్ మిల్లులు ఉన్నాయి. సీఎం కింద మిల్లర్లు క్వింటా ధాన్యానికి 67 శాతం చొప్పున 93,575 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ధాన్యం తీసుకున్న రోజు నుంచి గరిష్ఠంగా రెండు నెలల్లో సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా, సీజన్ ముగిసినప్పటికీ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 24,214 మెట్రిక్ టన్నుల బియ్యం డెలివరీ కాగా, మరో 69,361 మెట్రిక్ టన్నులు పెండింగులో ఉంది. ఒక్క వానాకాలం సీజన్‌కు సంబంధించి 69 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగులో ఉండగా, ఏళ్ల తరబడి మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వడంలేదని అధికారులు చెబుతున్నారు.

● నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై..

సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రైస్ మిల్లర్లపై అధికారులు చర్యలకు పాల్పడుతు న్నారు. సీఎంఆర్ కోసం పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో ప్రత్యక్ష చర్యలు చేపడుతున్నారు. ధాన్యం తీసుకుని, అసలే స్పందని మిల్లర్లపై పోలీస్ కేసులు నమోదు చేయిస్తున్న అధికారులు కొన్ని చోట్ల రైస్ మిల్లులను సీజ్ కూడా చేస్తున్నారు.

2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ కో టా ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై చర్యలకు పూనుకుంటు న్నారు. ఇందులో భాగంగా జైపూర్ మండలం ఇందారంలోని శివసాయి మిల్లును మూడు రోజుల క్రితం అధికారులు సీజ్ చేశారు. అలాగే స్వల్ప మొత్తంలో పెండింగులో ఉన్న మిల్లర్లకు సీఎంఆర్ కోసం మరికొంత సమయం ఇస్తుండగా, అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వాటికి 25 శాతం జరిమానా, జాప్యం జరిగిన ప్రతి ఏడాదికి 12 శాతం వడ్డీతో కలిపి మెట్రిక్ టన్నుకు రూ. 3589.20 చొప్పున వసూలు చేయనున్నారు.

పంట భూములు తీసుకోవద్దు

- పాత అలైన్‌మెంట్‌నే గుర్తించాలి
- అధికారులకు రైతుల మొర



మాట్లాడుతున్న నిర్వాసితులు

ఏసీసీ, మే 31: జాతీయ రహదారి నిర్మాణానికి అలైన్‌మెంట్ మార్చి తమ పంట భూములు తీసుకొని పొట్ట కొట్టొద్దని పలువురు రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాధిత రైతులతో కలిసి బీజేపీ సీనియర్ నాయకుడు తుల మధుసూదన్‌రావు, రిటైర్డు నీటిపారుదల శాఖ సూపరిండెంటెంట్ ఇంజనీర్ నారపరెడ్డి మాట్లాడారు. లక్సెట్టిపేట నుంచి గద్దెరాగడి వరకు ఎన్‌హెచ్ 63లో భాగంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పాత అలైన్‌మెంట్‌నే ఖాయం చేయాలని కోరారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పెట్టుబడిదారులకు పైరవీకారులకు అనుకూలంగా రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. మంచిర్యాల ఆర్డీవో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ, అభ్యంతరాలు, ఫిర్యాదులు తీసుకోలేదన్నారు. మార్చి 12న ఓపెన్ కోర్టు పేరిట అభ్యంతరాలను నమోదు చేయకుండా నామమాత్రంగా నిర్వహించారన్నారు. వందల మంది రైతులు ఆర్డీవో కార్యాలయం వద్దకు వస్తే కేవలం ఒకరిద్దరితోనే మాట్లాడుతానని ఆర్డీవో చెప్పడంతో రైతులు ఓపెన్‌కోర్టును బహిష్కరించి రోడ్డుపై ధర్నా చేపట్టి రాస్తారోకో చేశారన్నారు. రైతలందరు సంతకాలు చేసి మూకుమ్మడిగా ప్రస్తుతం ఉన్న ఎన్‌హెచ్ 63పైనే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాలని వినతి పత్రం ఇచ్చినా ఆర్డీవో పట్టించుకోలేదన్నారు. 2018లో చేసిన సర్వేలను రద్దు చేసి కొంత మంది ఆస్తులను కాపాడడానికే అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు నిరిస్తే రైతుల పంట భూములు నష్టపోతార న్నారు. భూసేకరణ, రోడ్డు నిర్మాణానికి రూ. 3 నుంచి 4 వేల కోట్ల నిధులు అవస రం అవుతాయని, ప్రస్తుతం ఉన్న ఎన్‌హెచ్ 63పైన నిర్మిస్తే 1,500 కోట్లతోనే నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. రాయపట్నం నుంచి మంచిర్యాల వరకు ప్రస్తుతం 40 మీటర్ల వెడల్పు రోడ్డు ఉందని, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌కు మరో 5 మీటర్లు భూసేకరణ చేపడితే సరిపోతుందన్నారు. అధికారులు మొండిగా వ్యవహరిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెట్టం తిరుపతి, రాజమౌళి, మల్లేష్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

కాసిపేట, మే 31: మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు శుక్రవారం వడదెబ్బతో మృతి చెందారు. కాసిపేట మండల కేంద్రానికి చెందిన దుర్గం భీమయ్య (55) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. ఉదయం కూలీ పనులకు వెళ్లి ఇంటిక వచ్చి న భీమయ్య వాంతులు చేసుకున్నాడు. స్పృహ కోల్పోవ డంతో ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

● చెన్నూరు పట్టణానికి చెందిన కలకోట కనకమహాలక్ష్మి(70) శుక్రవారం కాశీలో వడదెబ్బతో మృతిచెందింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కలకోట బాలేష్ 11 రోజుల క్రితం తన కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి కాశీకి వెళ్లాడు. శుక్రవారం కనకమహాలక్ష్మి వడదెబ్బ తగిలి అస్వస్తతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రయాణికుల సమస్యలపై సంతకాల సేకరణ

నస్పూర్, మే 31: సీసీసీ కార్నర్‌లో బస్ షెల్టర్, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగధారి చారి, నాయకులు అరిగెల మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, అరవింద్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జైపూర్, మే 31: నూతన చట్టాలపై పోలీసులు అవగాహన కలిగి ఉండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం జైపూర్‌లోని ఎస్టీపీపీలోని గెస్ట్‌హౌజ్ నూతన చట్టాలపై పోలీసులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు అమలులోకి తీసుకురానున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై పోలీసులు, సిబ్బంది పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏయే సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలని, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చే యాలని తదితర అంశాల గురించి తెలుస్తుందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని చెప్పారు. దీని వల్ల ప్రజలకు మరింత సమ ర్థవంతంగా సేవలందించేందుకు వీలుంటుందన్నారు. ఇంతకాలం పాటిస్తున్న పాత విధానాలలో నూతన చట్టాలకు విరుద్ధమైన వాటిని ఎట్టి పరిస్థితుల్లోను పాటించకూడదని, నూతన సెక్షన్‌ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. ఏసీపీ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ పోలీస్ అకాడ మీలో నూతన చట్టాలపై శిక్షణ పొందిన ఉన్నతాధికారులతో బ్యాచ్‌ల వారీగా నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రైతు సదస్సుకు తరలిరావాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి

చెన్నూరు, మే 31: చెన్నూరులో జూన్ 7న నిర్వహంచే రైతు సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి కోరారు. చెన్నూరులోని తాపీమేస్త్రీ సంఘం భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వడ్ల కొనుగోలులో కటింగ్ పేరుతో క్వింటాలుకు 8 నుంచి 10 కిలోలు కట్ చేస్తున్నారని, రైసుమిల్లుల వద్ద లారీలు అన్‌లోడ్ చేసేటప్పుడు రెండు కిలోలు కటింగ్ చేస్తున్నారని చెప్పారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కటింగ్ చేసిన వడ్లకు డబ్బులు చెల్లించాలని, రైతు రుణమాఫీ వెంటనే చేయాలని కోరారు. అనంతరం చెన్నూరు ఏరియా కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో బోడంకి చందు, కుందారపు చంద్రన్న, కిష్టయ్య, శ్రావణ్ కుమార్, సమ్మక్క, ఉమారాణి, నాగజ్యోతి, యామిని, సంపత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా నీటి సరఫరా

ఏసీసీ, మే 31: ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ మున్సిపాలిటీ ద్వారా పట్టణ ప్రజలకు నిరంతరాయంగా నీటి సరఫరా చేస్తున్నట్లు మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నం దున బోర్లలో నీరు ఇంకిపోతున్నా పట్టణంలో 90 శాతం ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా మున్సిపల్ నల్లాల ద్వారా ప్రతి రోజు తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. కొద్ది రోజుల్లో ఎండలు తగ్గుముఖం పట్టనున్నందున ప్రజలు సహకరించాలని కోరారు. కొత్తగా నల్లా కనెక్షన్‌లు కావాలంటే తెల్లరేషన్‌కార్డు ఉంటే రూపాయికే ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందన

జన్నారం, మే 31 :మండలంలోని కలమడుగు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను శుక్రవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. పదవ తరగతి పరీక్షల్లో 9.8 జీపీఏ సాధించడం, పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. అలాగే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ప్రథమ స్థానాల్లో విద్యార్థులు నిలువడంతో కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. అదనపు కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య , ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయులు రాకేష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఏసీసీ, మే 31: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. దీంతో నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో కూడా పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలన్నారు. 9 ఏళ్లుగా పదోన్నతులు, 6 ఏళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుం దన్నారు. విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యం వల్లనే పదోన్నతుల ప్రతిష్టంభన నెలకొందన్నారు. ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రామన్న, స్వామి, నర్సయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.